# ఇది హత్య కాదా?

రెండు చేతులూ తలక్రింద పెట్టుకుని వెల్లకితలా పడుకున్నాడు శాంతారాం. ఇటూ, అటూ కదులుతున్న కాలిబొటనవేళ్ళు రెండు అతను నిద్రపోవటం లేదని చెప్తున్నాయి. కిర్రుమని తలుపు శబ్దం కావడంతో కళ్లు కొద్దిగా తెరిచి గుడ్లు పక్కకి తిప్పి చూశాడు. తల్లి కామేశ్వరమ్మ లోపలికొచ్చి కొంగుకి చేతులు తుడుచుకుంటూ "నిద్రపోతున్నావేమిట్రా?" అని అడిగిన దానికి లేవకుండానే "లేదమ్మా!" అని తిరిగి కళ్లు మూసుకున్నాడు. శాంతారాం మంచం పక్కనే చాప పరుచుకుని తలగడ వేసుకుని నడుం వాల్చింది కామేశ్వరమ్మ.

రెండు రోజులుగా తల్లి తనతో ఏదో ప్రస్తావించాలని ప్రయత్నిస్తోందని శాంతారాం గ్రహించకపోలేదు. కానీ ఎందుకో ఆమెతో ఏమీ మాట్లాడాలని లేక ఆమె మాటల్ని అక్కడికక్కడే తుంచేస్తున్నాడు. కానీ యివాళ తల్లి రోజులా వెళ్లిపోకుండా తన గదిలోనే పడుకుందంటే చెప్పదలిచింది చెప్పే వెళ్తుందని అర్థమయింది.

"ఏరా అబ్బాయి! కవిత నగలన్నీ లాకర్‌లో పెట్టారా?" అన్న ప్రశ్నకి చివ్వున మంచంమీంచి లేచి కూర్చున్న శాంతారాంని చూసి కామేశ్వరమ్మ కాస్త కంగారుపడింది.

"ఎందుకమ్మా! దాని నగలిప్పుడు" అన్న ప్రశ్నకి,

'అబ్బే ఏం లేదురా! బీరువాలో కనబడకపోతేనూ ఎక్కడున్నాయో జాగ్రత్తగా వుంచారో లేదో అనీ...' అంటూ మాట తప్పిస్తున్న తల్లివైపు ఛీత్కారంగా చూశాడు శాంతారాం.

లేని ఆప్యాయత ఒలకబోస్తూ తల్లి అడిగిన దానిక్కారణం గ్రహించలేని మూర్ఖుడు కాదు శాంతారాం. ఆ ప్రశ్న వెనక ఆమె ఉద్దేశ్యం ఏమిటో తెలియని తెలివితక్కువ వాడూ కాదు. 'ఛీ ఏం మనుష్యులు! మనిషికన్నా ధనానికే ఎక్కువ విలువిచ్చే ఈ వ్యక్తుల్ని ఏమనాలి? హు' – అనుకుని పక్కకి తిరిగి పడుకున్నాడు.

శాంతారాం పడుకున్నాడేగానీ స్థిమితంలేని అతని మనసు కన్ను మూయనివ్వటంలేదు. గోడనున్న తమ పెళ్ళి ఫోటోవైపు చూస్తూ "కవితా! కవితా!!"

అనుకున్నాడు బాధగా. పక్కనే పడుకున్న సుప్రియ నిద్రలో ఒత్తిగిలి ఓ కాలు తీసి తండ్రి కడుపుమీద వెయ్యడంతో ఆ కాలుని నిమిరి ఆప్యాయంగా ఆ చిన్నారి ముఖంలోకి చూసాడు. పదేళ్ళపాటు తనతో గడిపినదానికి జ్ఞాపకార్థంగా కవిత సుప్రియని తనకి వదిలి వెళ్ళింది. తనకింక "తల్లి" అనే అమూల్యమైన వ్యక్తి లేదన్న నిజాన్ని తెలుసుకోలేని వయసులో ఉన్న సుప్రియ తండ్రి పక్కలో ఒదిగి అమాయకంగా నిద్రపోతోంది.

కవిత పోయి అప్పుడే పదిహేను రోజులు కావస్తోంది. పోయిన రోజున్న దుఃఖం మర్నాడుండదు. మర్నాటిది మూడోరోజుండదంటారు. కానీ శాంతారాం విషయంలో అలాకాకుండా కవిత లేని లోటు, బాధ అనేకంటే బెంగ, భయం రోజురోజుకీ అధికమవుతున్నాయనడం సహజం. నిజానికి కవిత బతికున్నప్పుడు ఆమె విలువ తెలిసి రాలేదు. ఆమె పోయాక ఆ విలువ యిప్పుడు తెలిసొస్తోంది. తనకోసం ఆమె ఏం చేసిందో అర్థమవుతోంది. ఈ పదేళ్ళూ జీవితం ఒక గాడిలో నడిచేదన్న నిజం తెలుస్తోంది. ఇప్పుడు? ప్రతీ విషయం సమస్యే!! తిండి గడిచేదెలా? ఇల్లు నడిపేదెవరు?? ముఖ్యంగా పిల్లని పెంచేదెవరు???

తన సమస్యలతో ఎట్టి సంబంధం లేకుండా బంధువర్గమంతా వెళ్ళిపోయారు. "నా అన్నవాళ్లు లేని యింటితో మాకేం పని" అన్నట్లు కవిత తాలూకు వాళ్ళు దినవారాలయిన మర్నాడే వెళ్ళిపోయారు. నిజమే! ఇదివరలో వాళ్ళెవరొచ్చినా ఒక్కసారి అభిమానంగా పలకరించామా? ఆప్యాయంగా ఒక్క పూట భోజనం పెట్టామా? 'ఆడపిల్లవాళ్ళు' అని వాళ్లని నీచంగా చూసేవాళ్ళం. ఈనాడెంత అభిమానంగా చూసినా వాళ్ళ పిల్లలేని యింట్లో వాళ్ళెందుకుంటారు? ఎందుకుండాలి?? తన తల్లీ, చెల్లెళ్ళూ కూడా ప్రయాణానికి సంసిద్ధమవుతున్నప్పుడు కవిత తాలూకు వాళ్ళెలా వుంటారు?! కనీసం తల్లి మనసులోనయినా అయ్యో! చిన్నపిల్లని వదిలేసి వెళ్తున్నాం, ఆ పిల్ల గతి ఏమిటనిగానీ, ఇంట్లో వాళ్ళ సంరక్షణ ఎలా జరుగుతుందనిగానీ, వీళ్ళ దిక్కేమిటనిగానీ ఆలోచిస్తున్నట్లు లేదు. పైగా ఆ చంటిది ఎవరి మెడకి గుదిబండ అవుతుందో అన్న భయంతో అంతా ఆ పిల్లని తప్పించుకు తిరుగుతున్నారు.

దినవారాలయిన మర్నాడే చెల్లెళ్ళు కవిత పెట్టెలు, బీరువాలు తెరిచి ఆమె చీరల్ని తీసి పంచుకోసాగారు. ఏదో పనిమీద ఆ గదిలోకెళ్ళిన శాంతారాం కాదృశ్యం జుగుప్స కలిగించింది. క్షణంసేపు వారివైపు తీక్షణంగా చూసి బైటికి వస్తున్న కొడుకు నుద్దేశించి, "సుప్రియ పెద్దదయి ఆ చీరలు కట్టేనాటికి పెట్టె చీకుడయి పోతాయని నేనే ఆడపిల్లల్ని ఆ పట్టుచీరలు తీసుకోమన్నానురా!" అంటున్న తల్లి మాటలకి జవాబేమీ యివ్వకుండా బైటికొచ్చేసాడు.

తను నిద్రపోయాననుకొని చెల్లెళ్ళు, తల్లి అనుకుంటున్న మాటల్ని విన్న శాంతారాం "వీరి మనసులో యింత స్వార్థం, కుళ్లు దాగి వున్నాయా? అని ఆశ్చర్యపోయాడు. తరువాత అసహ్యంతో "ఛీ ఏం మనుషులు!" అనుకున్నాడు.

"వదినకి మూడో, నాలుగో బంగారం సెట్లు వున్నాయి. అసలు వాడంతట వాడే చెల్లెళ్ళు ముగ్గురికీ మూడు సెట్లు యివ్వవచ్చుగా! అది ఎదిగే నాటికి నగలే చేయించలేకపోతాడేమిటి! అన్నయ్యకి మరీ జాగ్రత్తొచ్చేసిందే!" అని ఓ చెల్లెలు.

"అమ్మ అడగబోతే చిట పట లాడి అటు తిరిగి పడుకున్నాడుట. అమ్మ అంతకంటే చాతకానిది. గట్టిగా కొడుకు దగ్గర నోరిప్పలేదు" రెండో చెల్లెలి కామెంట్.

"మనకి గట్టిగా ఓ నెక్లస్ చేయించి అత్తారింటికి పంపలేదని వాడికి మాత్రం తెలీదూ? రేపు నేనడిగేస్తానుండు! చెక్కో - ముక్కో తేల్చేసుకు వెళ్ళడం మంచిది. ఎందుకీ ముసుగులో గుద్దులాట! అయినా ఆవిడగారు బతికున్నప్పుడు మనతో బాగానే వుండి మన పక్షమే మాట్లాడే వాడు కదా? పెళ్ళాం పోగానే యిలా మారిపోయాడేమిటి?!" అంది ఆఖరి చెల్లెలు.

"నేనడుగుతానర్రా! మీకెందుకా చెడ్డపేరు" అంటోంది తల్లి. ఈ మాటలే శాంతారాం అసహ్యానికి కారణం.

చెల్లెళ్ళు అన్నట్లు కవిత బతికి వున్నన్నాళ్ళు తల్లీ చెల్లెళ్ళు ఆమె మీద చెప్పే చాడీల్ని నమ్మి వాళ్ళ ఎదురుగానే ఆమెను తిట్టి పోసేవాడు. ఎప్పుడన్నా కవిత "అది కాదు యిది" - అని చెప్పపోతే తోక తొక్కిన త్రాచులా లేచి తను కుటుంబంలో చిచ్చు పెడుతున్నావంటూ ఎగిరి పడ్డాడే తప్ప తన వాళ్ళ గురించి చెడుగా ఎన్నడూ ఊహించలేదు. కవిత పోయిన దగ్గరనుంచి వీళ్ళ ప్రవర్తన చూస్తుంటే ఏవో కొత్త విషయాలు తెలుస్తున్నట్లుగా వుంది. ముఖ్యంగా తోబుట్టువులు కవిత వస్తువుల గురించి యింత నీచంగా ఆశిస్తారని అనుకోలేదు. దీంతో గతంలో వీళ్ళంతా కవిత పట్ల ప్రవర్తించిన తీరు గుర్తొచ్చి బాధ పడసాగాడు.

ఆ నగలు గానీ, ఆ చీరలు గానీ కవితకి తనుగానీ, తన వాళ్ళుగానీ కొన్నవి కావు. అవన్నీ ఆమె పుట్టింటి వారు యిచ్చినవే! తనీ యింటికి ఒక్కడే కొడుకు, పెద్ద కొడుకు కూడా - తన పెళ్ళియిన దగ్గరనుంచి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, పురుళ్ళు, బారసాలలూ, పండగలు అంటూ ఒకదాని తరువాత మరొకటి రావడంతో ఖర్చులు తట్టుకోలేక కవితకి కనీసం కట్టుడు చీరలు కూడ కొనలేక పోయేవాడు. ఆమె పుట్టింటి వారు కాస్త వున్నింటి వాళ్ళు కావడంతో ఆమెకి లోటులేకుండా పెట్టేవారు. అది చూసి తమకంతల్లా జరగటం లేదని చెల్లెళ్ళు తమని తాము తిట్టుకుని, పుట్టింటిని తిట్టి, కవితని చూసి అసూయతో సాధించి, దెప్పిపొడిచేవారు.

ఒక్కరోజు కూడ కవిత తన మాట కాదనలేదు. మనస్సులో ఏమున్నా బైటకి ఎప్పుడూ చెప్పేది కాదు. ఆడబిడ్డలకి, మేనకోడళ్ళకి అన్నీ చేస్తున్నా తనకీ, బిడ్డకీ ఏమీ చెయ్యలేదని ఎరుగదు. నోరు మెదపని కవితని తల్లీ, చెల్లెళ్ళు ఎన్ని మాటలన్నా మూగవాడిలా వింటూ వూరుకునే వాడేగానీ, ఒక్కనాడూ వాళ్ళని వారించలేదు. చాటుగా కళ్ళ నీళ్ళెట్టుకుంటున్న భార్యని వూరడిస్తే తన వాళ్ళెక్కడ లోకువ అవుతారో అన్నట్లు చూసీ చూడనట్లు వెళ్ళి పోయేవాడు. పైగా తనకేలోటు జరిగినా చిరాగ్గా వున్నా అందరి ఎదురుగా కవిత మీద విరుచుకు పడటంతో మరీ లోకువగా వుండేది.

డిగ్రీ పూర్తి చేసి పి.జి.లో చేరిన ఏడాదే తండ్రి పోవడంతో తండ్రి ఆఫీసులోనే శాంతారాంకి ఉద్యోగం యిచ్చారు. ఆ ఉద్యోగంతోపాటు ఇంటి బాధ్యతలన్నీ తన నెత్తిన పడటంతో వచ్చే జీతం చాలక, చెల్లెళ్ళ, బావగార్ల అలకలు తీర్చలేక, తీర్చక తప్పని పరిస్థితుల్లో అప్పుల భారం పెరిగిపోతుంటే కలిగే చిరాకు, విసుగు పెళ్ళాంపై చూపించేవాడు శాంతారాం.

పెళ్ళయిన పదేళ్ళ తరువాత కవిత పోయాకగానీ తనకి ఆమె విలువ తెలిసి రాలేదు. "తన్నీస్థితికి దిగజార్చిందెవరన్నది" కవిత పోయాక తెలిసొస్తోంది. "దేని విలువన్నా పోయాకగానీ తెలిసిరాదన్నారు పెద్దలు అది ముమ్మాటికి నిజం" అనుకున్నాడు శాంతారాం.

'ఒరేయ్ అబ్బాయీ! ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసావు. కాదనటం లేదు. కానీ ఒక్కపిల్లకీ పట్టుమని పదికాసుల బంగారం పెట్టలేదు. మనం జతగాజులు, పుస్తెల తాడుతో పంపేసాం. ఆడపిల్లలు బాధపడుతున్నారురా! పోనీ ఆనాడు నీ దగ్గర లేదనుకో! కోడలి నగలు బ్యాంకులో పడున్నాయి. అది లేనేలేదు. దానివి మూడుసెట్లు ముగ్గురాడపిల్లలకీ పంచి యిస్తే బాగుంటుందిరా!' అని అంటున్న తల్లి మాటలకి తలెత్తి చూసాడు శాంతారాం. కొడుకు చూసిన చూపుల్ని తట్టుకోలేక తలొంచుకుంది కామేశ్వరమ్మ తప్పు చేసినదానిలా.

"చూడమ్మా! యిందాకా మీ మధ్య జరిగిన సంభాషణంతా విన్నాను. కవితకో కూతురుంది. అది ఈనాడు లేకపోయినా - దానికా నగలు మనం పెట్టినవి కాదు. దాని బిడ్డకి కూడా నేను ఏమీ కొనలేదన్న విషయం నీకూ తెలుసు. దాని పుట్టింటి వారు యిచ్చిన నగలు దాని పిల్లవి. వాటిమీద ఎవ్వరికీ హక్కు లేదు. దాని నగల విషయం మర్చిపొండి" అని ఖచ్చితంగా కొడుకు అన్న మాటలకి తెల్లబోయి చూస్తూ వెనుదిరిగింది కామేశ్వరమ్మ.

కోడలు బతికుండగా తనూ, పిల్లలూ ఆడింది ఆట, పాడింది పాటగా సాగిన ఆ యింట్లో కవిత పోగానే మరింత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లభించాయనుకున్న కామేశ్వరమ్మకి కొడుకు ప్రవర్తన ఆశ్చర్యాన్ని భయాన్ని కలిగించాయి. కొడుకు దగ్గరనుంచి యిలాంటి జవాబుని ఆశించని ఆమె అవమానంతో, కోపంతో లోపలికెళ్ళిపోయింది.

వెనుదిరిగి వెళ్ళిపోతున్న తల్లిని చూసి శాంతారాం బాధగా నిట్టూరుస్తూ రెండు చేతుల్తో తల పట్టుకుని కుర్చీ వెనక్కి వాలాడు.

ఈ కరుకుదనమే కనీసం ఏదాడి క్రితం వుండివుంటే? ఈనాడు తెలుసుకున్న నిజాన్ని ఆనాడు తెలుసుకోవాలని ప్రయత్నించి వుంటే?? నా కవిత నాకు దక్కి వుండేది!! ఈనాడు తల్లీ, తోబుట్టువుల్నీ నిందిస్తున్నాడు – ఆనాడు తను చేసిందేమిటి? తన వాళ్ళంతా కవితని చులకనగా చూసారంటే కారణం ఏమిటి? భర్తే భార్యకి గౌరవం యివ్వకుండా అందరి ఎదురుగా సాధిస్తే ఆమె అందరికీ లోకువ కాక ఏమవుతుంది? ఇంటి కెందరొచ్చినా ఒక్కర్తీ గొడ్డులా చాకిరీ చేసి చేసి బైటికొస్తే ఒక్కరోజు – ఒక్కసారి సానుభూతితో పలకరించి మాట్లాడాడా? ఆప్యాయంగా దగ్గరకి తీసుకున్నాడా? ఒక్కర్తిని కూర్చోబెట్టి తల్లీ, తోబుట్టువులతో తనూ కలిసి ములుకు లాంటి మాటలతో పొడిచి, అవమానించి ఆనంద పడేవాడు. ఎప్పుడన్నా ఆరోగ్యం సరిలేక బాధపడుతుంటే కనీసం గవర్నమెంటాసుపత్రికి తీసుకెళ్ళి మందన్నా యిప్పించలేదు. ఒకటి రెండుసార్లు చూసి తరువాత అనారోగ్యంతో ఎంత బాధపడుతున్నా పెదవి విప్పకుండా పన్లు చేసుకుపోయేది.

"ఏం రాణీగారి కివాళింకా తెల్లారలేదా?" అంటూ వెటకారంగా లేపుతున్న భర్తని చూసి 'రాత్రి నుంచీ గుండెల్లో నొప్పి మరీ ఎక్కువగా వస్తోందండీ, గాబరాగా వుండి చమటలు పోస్తున్నాయి. ఊపిరి కూడా ఆడటంలేదు' అంటున్న కవిత మాటల్ని పూర్తి చెయ్యనివ్వకుండానే – 'అన్ని రోగాలూ ఒక్కసారిగా యిప్పుడే వచ్చేసాయా? ఇదేం నీ బాబిల్లు కాదు – గారాలు గుడవటానికి. ఎక్కడాలేని రోగాలు నా చెల్లెలు, పిల్లలు రాగానే వచ్చేస్తాయి – లేలే – లేచి పన్లుచూడు – నాకు ఆఫీసుకు టైమవుతోంది. నీ బాబుకో వుత్తరం రాయి, నీకో వంట మనిషిని పంపమని. అదొచ్చాక దర్జాగా పడుకుందుగాని' అంటూ చక చకా అక్కడినుంచి వెళ్ళిపోయిన భర్తవైపు బాధగా చూసి అక్కడినుంచి లేవలేక నేలమీద కూలబడి పోయింది కవిత. వంటింటి లోంచి అత్తగారి సణుగుడు వినపడుతోంది. ఎంత ప్రయత్నించినా కాలూ చెయ్యీ కదలటంలేదు.

స్నానం చేసి వచ్చిన శాంతారాం నేలమీద ఉన్న కవితని కాలితో కుదుపుతూ 'అంత మత్తునిద్ర పట్టిందా దొరసానమ్మగార్కి!' అన్న మాటలకి బలవంతంగా తల తిప్పిన కవిత నోటి వెంట కారుతున్న రక్తం చూసి నిజంగానే కంగారు పడిపోయి, "అమ్మా! అమ్మా! కవిత, కవిత" అంటూ కేకలెడుతూ మొదటిసారి భార్యకోసం డాక్టర్ దగ్గరికి పరుగెత్తాడు శాంతారాం.

డాక్టరొచ్చి ఆమె ప్రాణం పోయిందని చెప్పి వెళ్ళిపోయాడు.

నెల్లాళ్ళుగా తరుచు గుండెల్లో ఏదో బాధగా వుంటోందంటూ తనతో చెప్పబోయిన ప్రతీసారీ నిర్లక్ష్యంగా, వినకుండానే కసరికొట్టి.. వెటకారంగా ఆడిన మాటలకి ఫలితం యిప్పుడు ప్రతీ క్షణం గుర్తొచ్చి బాధపడుతున్నాడు. కానీ ప్రయోజనం ఏమిటి?? చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుంది తన విచారం, ఏడుపూ.

'పేపర్లో ప్రతీరోజూ కొన్ని హత్యల గురించి చదువుతున్నాం. అందులో కొన్ని కట్నాల చావులు. కవితది కట్నాల చావుకాదు. కానీ యిదిమాత్రం హత్యకాదా? కిరసనాయిలు పోసి అంటించి విషం పెట్టి చంపితేనే హత్యా? మనిషి సాటి వ్యక్తిని సానుభూతితో చూడక, దయాదాక్షిణ్యాలు లేకుండా బాకుల్లాంటి మాటల్తో మనసు గాయపర్చి, రోగానికి మందన్నా యిప్పించకుండా వదిలెయ్యడం మాత్రం హత్యకాదూ? భర్త నీచంగా చూడబట్టే యింట్లో అంతా ఆమెని నీచంగా చూసారు. నాలాంటి వారి మూర్ఖత్వానికి కవితలాంటి వారెందరు బలవుతున్నారో! అయినా నా లాంటి వాళ్ళని ఏ కోర్టూ శిక్షించలేదు. ఏ న్యాయస్థానమూ ఏమనలేదు. కారణం కత్తితో పొడవలేదు – కిరసనాయిలు పోసి చంపలేదు. విషం అంతకంటే పెట్టలేదు!

కత్తితో పొడిస్తే శరీరంమీద కత్తిపోట్లు కనబడతాయి. మాటల బాకుతో పొడిచే పోట్లు కనబడవుగా?! కిరసనాయిలు పోసి అంటిస్తే గాయాలు కనబడతాయి. మందిప్పించకుండా చంపితే గాయాలు పడవుగా?! అందుకే నేను హంతకుడిని కాదు. మంచి వాడిని. సో – దాంతో పన్నెండో రోజు దాటిన దగ్గరనుంచీ ఆడపిల్లల తండ్రులు నా యింటి చుట్టూ తిరుగుతున్నారు పిల్లనిస్తామంటూ.'

వనిత మాసపత్రిక

ఏప్రిల్ 1990